క్లుప్తంగా

గురజాడ పురస్కారం అందుకున్న మోదుగల



పురస్కారం అందుకుంటున్న సుబ్బారావు

పర్చూరు (చినగంజాం): విశ్వకవి గురజాడ వెంకట అప్పారావు 162వ జయంతి సందర్భంగా చెరుకూరు గ్రామానికి చెందిన తెలుగు భాషోపాధ్యాయుడు మోదుగల సుబ్బారావుకు గురజాడ పురస్కారం లభించింది. గురజాడ ఫౌండేషన్ (యూఎస్ఏ) వారు గురజాడ స్ఫూర్తి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2023తో విశాఖ పట్నంలో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రశంస పత్రం, జ్ఞాపిక, నగదు అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పేరం సుబ్బారావు, మిత్రులు మోదుగులను అభినందించారు.

సర్వేతో వ్యాధులకు చెక్



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణ

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేతో వ్యాధిగ్రస్తులకు చెక్ పెట్టవచ్చని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ అన్నారు. గురువారం ఉప్పుమాగులూరు-2 సచివాలయ పరిధిలో జరుగుతున్న సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం గుంటుపల్లి గ్రామంలోని సచివాలయం జగనన్న కాలనీ లేఅవుట్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.

ఆదిపూడి (కారంచేడు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బాపట్ల జిల్లా సహకార శాఖాధికారి, మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఆదిపూడి, తిమిడెదపాడు గ్రామాల్లో జరుగుతున్న డోర్ టూ డోర్ సర్వేను క్షుణ్ణంగా పరిశీలించారు.

జగనన్నతోనే ముస్లిం సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్

అద్దంకి: సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే ముస్లింల సమస్యలకు పరిష్కారం సాధ్యమని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ ఇమాం హుస్సేన్ అన్నారు. గురువారం సంతమాగులూరు మండలంలోని మసీదులను సందర్శించి ముస్లింలతో మాట్లాడారు. రాష్ట్రంలో జగనన్న ముస్లింల చేయూతకు, అభివృద్ధికి ఎంతో సహకరించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ముట్లపూడి బాజీవలి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సజీర్ అహమ్మద్, గద్దం మస్తాన్‌వలి, కొమ్మాలపాడు వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ ఫరీద్, ఖాసిం సైదా, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

చీరాల అర్బన్: చదువుతో పాటు ఆటల్లోనూ రాణించి విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్ఆర్‌పీఎం హైస్కూల్ ఆవరణలో నియోజకవర్గ స్థాయి ఉన్నత పాఠశాలల ఆటల పోటీల నిర్వహణకు, క్రీడాకారుల ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్, ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలిని సన్మానించారు. అలానే సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సుందరరామిరెడ్డిని సన్మానించారు.

ప్రభుత్వ పథకాలు అందించాలి

చీరాల టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేలా అధికారులు విధులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. గురువారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాలను ఎంపీడీవో తనిఖీ చేసి పెండింగ్ అర్జీలను విచారించారు. గ్రామ సచివాలయాల వారీగా వచ్చిన అర్జీలు, విచారించిన అర్జీలను పరిశీలించి సూచనలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు ఇన్‌చార్జి ఈవోఆర్డీ మురళీబాపూజీ, సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

ప్రతి రోజూ కాలువలు శుభ్రం చేయాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది, కార్పొరేటర్

ఒంగోలు సబర్బన్: నగరంలోని మురుగు కాలువలను ప్రతి రోజూ శుభ్రం చేయాలని పారిశుద్ధ్య కార్మికులను, ఇన్‌స్పెక్టర్లను ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని 9వ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహ కల్ప ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. నగరంలో ర్యాలీ నిర్వహించారు. క్లాప్ ఆటోలు వెళ్లే వీలులేని ప్రాంతాలకు తోపుడు బళ్ళు ద్వారా చెత్త సేకరణ చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. అర్బన్ హెల్త్ సెంటర్ త్వరలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నామన్నారు. కార్పొరేటర్ వెన్నపూస శోభారాణి వెంకటరెడ్డి, ఎంఈ జానీ బాష, డీఈ రఘురాం, ఏఈ సాయిరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న కేశవరాజు పేట, గాంధీ రోడ్డు వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం ఇస్లాంపేట, గోపాల్ నగర్ వార్డు సచివాలయాలను కూడా పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం సర్వే వేగంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

గ్రామైక్య సంఘాలు ఆదర్శంగా నిలవాలి



మాట్లాడుతున్న పీడీ రవికుమార్

మద్దిపాడు: గ్రామైక్య సంఘాలు తమ గ్రామాల్లో కావాల్సిన వనరులను గుర్తించి వాటిని పొందడానికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుని గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని వైఎస్సార్ కేపీ డీఆర్‌డీఏ పీడీ టి. రవికుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, 11 మండలాల ఏపీఎంలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆదర్శ మండలాలను తీర్చిదిద్దాలనే సంకల్పంతో నాలుగు విడతల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మొదటి రోజు గ్రామైక్య సంఘాలు తమ గ్రామాలను ఆదర్శంగా తీర్చి దిద్దుకోవడానికి ఎటువంటి కలలు, లక్ష్యాలు వాటిని చేరుకోవడానికి అనుసరించాల్సిన వ్యూహాల గురించి వివరించారు. శిక్షకులుగా మద్దిపాడు ఏపీఎం నరేంద్ర కుమార్, మాణిక్యరావు, లక్ష్మీనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా ఐబీ డీపీఎం కృపారావు, ఐబీ ఏపీఎం గంటా శ్రీనివాసరావు, 11 మండలాల ఏపీఎంలు, మద్దిపాడు మండలంలోని గ్రామైక్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవం



నిమజ్జనోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: నాయుడుపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వినాయక నిమజ్జనోత్సవంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. భక్తులనుద్దేశించి వినాయక చవితి, నిమజ్జనోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినందుకు వారిని అభినందించారు. జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కూరాకుల రాఘవరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెలుగు జాడ మన గురజాడ



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు కళా మిత్రమండలి సభ్యులు

ఒంగోలు మెట్రో: స్థానిక కొత్తపేట కొండయ్య బొంకు రోడ్డులో గల శనగవరపు నిలయంలో గురువారం కళామిత్రమండలి (తెలుగు లోగిలి), తెలుగు సాంస్కృతిక సమితి సంయుక్త నిర్వహణలో గురజాడ అప్పారావు 161వ జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డా.నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ జాతీయ భావాలను గుండె నిండా నింపుకున్న నూత్నభాషా సృష్టకర్త, నవ్యమార్గ నిర్దేశికుడు, కులవ్యవస్థను చీల్చి చెండాడుతూ మానవతా వాదానికి పెద్దపీట వేసిన దార్శనికుడు గురజాడ అప్పారావు అని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శనగవరపు సుబ్బయ్య మాట్లాడుతూ కాలంతో పాటు కదులుతూ జీవితాన్ని, సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తూ, భాషలో, భావంలో విప్లవాన్నితన రచనల్లో ప్రతిపాదించిన గొప్ప సంఘసంస్కర్త, ముత్యాల సరాల సృష్టికర్త అని తెలిపారు. తెలుగు సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు యు.వి.రత్నం ప్రసంగిస్తూ తెలుగు నేలను పునీతం చేయటానికి పుట్టిన మహనీయుల్లో గురజాడ ఒకరని, సమాజంలో పాతుకు పోయిన మూఢ విశ్వాసాలను తొలగించుటకు, వర్ణ వ్యవస్థను రూపు మాపేందుకు తనవంతు కృషి చేశారని కొనియాడారు.కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించే విధంగా ఎన్నటికీ మర్చిపోలేని రీతిలో వ్యవహారిక భాషకు పట్టం కట్టి, నాది ప్రజల ఉద్యమం దాన్ని ఎవర్నో సంతోష పెట్టడానికి వదులుకోలేను అని చెప్పిన వారు మహాకవి గురజాడ అని ఉద్ఘాటించారు. పిన్ని వెంకటేశ్వర్లు, డా.సంతవేలూరి కోటేశ్వరరావు, ధేనువకొండ సుబ్బారావు,అంగలకుర్తి ప్రసాద్, దారా సుబ్బారావు, రంగుల వాసు, ఓరుగంటి ప్రసాద్, చోడా లక్ష్మీనారాయణ, హరివరం మహేశ్వరాచారి యం.రంగారావు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



సుబ్బారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆమంచి

పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, వైఎస్సార్ వీరాభిమాని వల్లభరెడ్డి సుబ్బారెడ్డి (78) మృతి చెందారు. గురువారం ఉదయం గుండెపోటు రావడంతో ఆయన స్వగ్రామమైన నూతలపాడులోనే తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుబ్బారెడ్డి నూతలపాడు సర్పంచ్‌తో పాటు పలు పార్టీ పదవులను అలంకరించారు. అతనికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పలు రకాల రాజకీయ ఉపన్యాసాలతో అందరినీ ఆకట్టుకునే స్వభావం ఉన్న సుబ్బారెడ్డి మృతిపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ సుబ్బారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనతో తనకున్న అనుబంధం గురించి కుటుంబ సభ్యులతో గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర రైతు సాంకేతిక విభాగం అధ్యక్షుడు ఎంపీఎస్ నాగిరెడ్డి సుబ్బారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో అద్దంకి మాజీ ఎంపీపీ వైవీ భద్రారెడ్డి, భవనం రాజగోపాల్‌రెడ్డి, ఎర్రం లక్ష్మారెడ్డి, అంజిరెడ్డి, బ్రహ్మారెడ్డి, సుధాకర్ రెడ్డి నాయకులు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ బీమా



నగదు అందిస్తున్న దృశ్యం

చీరాల టౌన్: అనారోగ్యంతో మరణించిన కుటుంబ పెద్దను కోల్పోయిన బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా ఆదుకుని అండగా నిలుస్తుందని సచివాలయాల కన్వీనర్లు షేక్ బాబు, షేక్ మస్తాన్ అన్నారు. మండలంలోని ఈపురుపాలెం పీర్లచావిడికి చెందిన షేక్ హుస్సేన్ అనారోగ్యంతో మృతి చెందాడు.మృతుడు వైఎస్సార్ బీమా పథకంలో సభ్యుడు కావడంతో మట్టి ఖర్చుల కోసం మంజూరైన రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రవీణ్ మృతుడి భార్య జహెరూన్‌కు అందించారు. కార్యక్రమంలో వలంటీర్ షరీఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

13 మందిపై కేసులు నమోదు

బల్లికురవ: రాష్ట్రంలో 30 యాక్ట్ అమలులో ఉన్నా కొవ్వొత్తులతో స్థానిక బస్టాప్ వద్ద నుంచి నిరసనగా తరలిరాగా సుమోటోగా కేసులు నమోదు చేసినట్లు బల్లికురవ పోలీస్‌స్టేషన్ ఎస్సై సీ. బాలకృష్ణ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలోని బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహం ముందు అదే గ్రామానికి చెందిన ఏల్చూరి శ్రీనివాసరావు మరో 12 మంది నిరసన చేపడుతున్నందున కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



నగదు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

చీమకుర్తి: కొత్త కుమ్మరిపాలెం 7వ సచివాలయం పరిధిలో రాజవరపు ముసలయ్య (55) గుండెపోటులో గురువారం మృతి చెందాడు. దీంతో వారి కుటుంబ సభ్యులకు మున్సిపల్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, కమిషనర్ షేక్ ఫజులుల్లా చేతుల మీదుగా మట్టి ఖర్చుల కోసం రూ.10 వేలను అందించారు. కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. స్థానిక కౌన్సిలర్ మేకల సులోచన యల్లయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, కె.సుబ్రహ్మణ్యం, గుమ్మడిదల వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా అప్లికేషన్లు పూర్తి చేయండి

నాగులుప్పలపాడు (మద్దిపాడు): ప్రతి గ్రామంలో ఉన్న వైఎస్సార్ సీపీ కన్వీనర్లు గృహసారథులు ఉచిత బీమా అందుకోవడానికి త్వరగా జేసీఎస్ సైన్యం యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని పూర్తి చేసుకోవాలని మండల జేసీఎస్ కన్వీనర్ కొమ్మూరి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆదేశాల మేరకు యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని ప్రతి కన్వీనర్ గృహ సారథి యాప్‌లను డౌన్‌లోడు చేసుకోవాలని కోరారు.

బాల్య వివాహాలు నివారించాలి

ఒంగోలు అర్బన్: జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నివారించి బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం చీఫ్ సెక్రటరీ నిర్వహించిన వీడియో సమావేశం అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో బాలికల డ్రాప్ అవుట్స్‌పై కచ్చితంగా నిఘా ఉంచాలన్నారు. ఫంక్షన్ హాళ్ల వద్ద బాల్య వివాహాలు నిషేధం అనే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. .

జీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

చీరాల టౌన్: పాడి పశువుల పెంపకంలో, జీవాల ఆరోగ్యంపై పశుపోషకులు జాగ్రత్తగా ఉండటం వలన జీవాలకు సీజనల్ వ్యాధులు దరిచేరవని ఈపురుపాలెం పశువైద్యురాలు పావని అన్నారు. గురువారం మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 39 గేదెలకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 19 గొర్రెలు, 18 దూడలకు, పాడి పశువులు 25కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

మార్టూరు తహసీల్దార్‌గా సుజాత

మార్టూరు: మండల నూతన తహసీల్దార్‌గా కే సుజాత గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల భూ విభాగంలో ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన సుజాత బదిలీలో భాగంగా మార్టూరు రాగా ఇక్కడ తహసీల్దార్‌గా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన సురేష్‌బాబు బాపట్లలోని సుజాత స్థానంలో బదిలీపై వెళ్లారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సుజాతను ఆర్ఐ బాషా, ఇతర ఉద్యోగులు అభినందించారు.

పీఈటీ రోజ్ హెల్మాకు సత్కారం



రోజ్ హెల్మాను సత్కరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

చీరాల రూరల్: ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఈపురుపాలెం బాలికోన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్. రోజ్ హెల్మాను గురువారం స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు, సహచరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ పి. రామచంద్రారెడ్డి హాజరయ్యారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు పి. సుందరరామిరెడ్డిని సహచరులు శాలువాతో సత్కరించారు.

టీడీపీ ఆరోపణలను ఖండించిన సర్పంచ్



మాట్లాడుతున్న సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి

చీమకుర్తి: పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని టీడీపీ నాయకులు బుధవారం చేసిన ఆరోపణలను ఖండిస్తూ సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగం కాలేదని, వాటికి సంబంధించిన జమా ఖర్చుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచుతామని, కావాలంటే వచ్చి చూసుకోవచ్చని దీటుగా సమాధానమిచ్చారు. టీడీపీ పాలనలో మాజీ సర్పంచ్ ఆర్.అంకారావు రూ.79 లక్షలను దుర్వినియోగం చేస్తే ఆ తప్పులు మరిచిపోయి వైఎస్సార్ సీపీ పాలనలో నిజాయతీగా పనిచేస్తున్న తనపై నిందలు వేయడం సరికాదని సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిండికేట్ సొసైటీ స్థలం ఆక్రమించుకోలేదని, పంచాయతీ తీర్మానంతోనే నిర్మించారని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డిపై ఆరోపణలు చేయటం సరికాదని సర్పంచ్ దర్శి నాగమణి టీడీపీ మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, ఇతర నాయకుల ఆరోపణలను ఖండించారు. వైస్ ప్రెసిడెంట్ ఐవీ సుబ్బయ్య, వీర రాఘవులు, రామాంజమ్మ, విజయలక్ష్మి, అంజనాదేవి, రమణ, నెహేమియా పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు బూచేపల్లి శంకుస్థాపన



సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, కన్వీనర్

చీమకుర్తి: మున్సిపాలిటీలోని 6వ వార్డు పరిధిలో రూ.21 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా గురువారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, కమిషనర్ ఫజులుల్లా, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, పార్టీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తారు రోడ్డుకు శంకుస్థాపన

చీమకుర్తి: మువ్వవారిపాలెం నుంచి చినరావిపాడు వరకు ఐదున్నర కిలోమీటర్లు మేర రూ.2.30 కోట్లతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, పార్టీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు గురువారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న తారు రోడ్డు పూర్తయితే మువ్వవారిపాలెం, చినరావిపాడు మధ్య ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాసరి లక్ష్మీనారాయణ, బొడ్డు కోటేశ్వరరావు, కుంచాల రాంబాబు, పులి శ్రీనివాసరావు, తన్నీరు శ్రీను, అనుమోలు సింగయ్య, పులి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్య కంటే మిన్న

మోటుమాల (కొత్తపట్నం): కార్పొరేట్ విద్యకు మిన్నగా కేజీబీవీలో విద్య అభ్యసిస్తున్నారని కేజీబీవీ జాయింట్ సెక్రటరీ గీత ఉపాధ్యాయులను అభినందించారు. గురువారం మోటుమాలలో ఉన్న కేజీబీవీను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠ్యప్రణాళిక అమలు తీరు, పరిశుభ్రత, మెనూ అమలు గురించి ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్య తీరు జగనన్న కార్యక్రమాలైన విద్యాకానుక, నాడు-నేడు, జగనన్న గోరుముద్ద వాటి అమలు తీరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏ దేశంలో, ఏ రాష్ట్రంలో లేని మన రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్ కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నాడని తెలిపారు. మన మంత వారి ఆశయాలకు అనుగుణంగా బాధ్యతగా వ్యవహరించి ఉన్నత శిఖరాలను అధిరోహించాని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. విద్యార్థినులకు ఆత్మస్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపారు. 10వ తరగతి విద్యార్థులకు 500 మార్కులు పైగా పబ్లిక్ పరీక్షలో సాధించుటకు మెళకువలు నేర్పించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ ప్యానల్స్, బీవైజైయూఎఎస్ ట్యాబ్స్‌ను సక్రమంగా అందరువిగియోగించుకోవాలని సూచించారు. జీసీడీవో, సమగ్రశిక్ష ప్రకాశం వారు ఎం.ప్రమోద, ఎస్‌వో వి.అరుణ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల అరెస్టు

- 75 కేజీల రాగి, 10 కేజీల అల్యూమినియం తీగలు స్వాధీనం
- నిందితులిద్దరు తండ్రీకొడుకులు
- పోలీసు సిబ్బందికి అభినందనలు

జే.పంగులూరు: ట్రాన్స్ ఫార్మర్ దొంగలను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరిచారు. రేణింగవరం పోలీసుల వివరాల మేరకు.. గతేడాది మండలంలో పలు గ్రామాల్లోని పంట పొలాల్లో రాగితీగలు, ట్రాన్స్‌ఫార్మర్ చోరీలు ఎక్కువ అయినట్లు తెలిపారు. ఈ విషయమై అనేక మార్లు రైతులు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని అలవలపాడు క్రాస్ రోడ్డు వద్ద దొంగిలించిన రాగితీగలు సంచుల్లో ఉంచి అమ్ముకొని వద్దామని చీమకుర్తికి చెందిన నాగులూరి యాకాబు, నాగులూరి ఏసు అను నిందితులు ఇద్దరు ఆటో కోసం ఎదురు చూస్తున్నారు. గమనించిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు తండ్రీకొడుకులు జులాయిగా తిరుగుతూ చెడు వ్యసనాలకు అలవాటు పడి ఇద్దరు ఒకట్టై దొంగతనాలు సులుగా చేయవచ్చని నిర్ణయించుకున్నారన్నారు. అర్ధరాత్రులు, జనం లేని ప్రదేశాలు ఎంచుకొని పలు గ్రామాల్లో రైతులు తమ పొలాలకు అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి అందులోని రాగి తీగను తీసుకొని వెళ్లి అమ్ముకొనేవారు. అక్రమమార్గంలో డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో 2023 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు తండ్రీకొడుకులు ఇద్దరు జే పంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 12 ట్రాన్స్‌ఫార్మర్లు, కొరిశపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో 2 ట్రాన్స్‌ఫార్మర్‌లు, మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2 ట్రాన్స్‌ఫార్మర్లు తొంగిలించారు. ఈ పరిధిలో మొత్తం 12 నేరాలు చేసి 16 ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి, అందులో అయిల్ కింద పారబోసి, 70 కేజీలు రాగితీగ, 10 కేజీల అల్యూమినియం తీగను దొంగిలించారు. ఈ దొంగిలించిన వాటిని అలవలపాడు గ్రామ శివారులో ఉన్న ఇటుకల బట్టీలోని పాడుబడిన రేకుల షెడ్డులో దాచి పెట్టేవారు. వీరిపై రేణింగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 8 కేసులు, కొరిశపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో 2, మేదరమెట్ల స్టేషన్ పరిధిలో 2 కేసుల నమోదు అయినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 75 కేజీలు రాగి తీగ, 10 కేజీల అల్యూమినియం తీగను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చీరాలు ఎస్‌డీపీఓ ఎస్ ప్రసాద్, అద్దంకి రూరల్ సీఐ ఆర్ ఉమేష్‌లు మంచి ప్రతిభను కనపరిచి నిందుతులను పట్టుకున్న రేణింగవరం ఎస్సై కేకే తిరుపతిరావు, సిబ్బంది చిరంజీవి, విజయ్‌కుమార్, మత్తయ్య, వెంకటేశ్వర్లు, వెంకట్రావులను అభినందించారు.